ఘోర విపత్తు

కథానిక

చామర్తి దుర్గాప్రసాద్

"ఏమిటి బాబాయ్ కార్లు తిరణాల్లో ప్రభల్లా పోతున్నై" అడిగాడు పొలం దున్ను కుంటున్న రైతు వెంకయ్య, రోడ్డుమీద పోతున్న మునసబుని కేకేసి "నీకు తెలీదట్రా వెర్రి వెంకన్నా! మన ప్రియతమ నాయకుడు ఆస్పత్రిలో ఉన్నాడ్రా. పెద్దాసుపత్రికి ఇదే గదరా తోవ - అదీ కత" అనేసి మునసబు గారు దారే పోతున్న కారాపేసి ఎంచక్కా కూచుని చక్కా వెళ్ళిపొయ్యారు. పోతూ పోతూ ఓ పాలి కేకేశారు, "నెల రోజుల బట్టీ పన్లవీ కట్టేసి ఆయన ఆరోగ్యం కోసం తిరుగుతున్నాంరా. నువ్వే మాత్రం అరక వదలవ్ - సరేగాని నీ చిన్నోడున్నది ఆసుపత్రిలోనేగా చూసొస్తాన్లే". వార్డు నంబరు కూడా కనుక్కోకుండా పోతున్న మునసబు గారు ఎలా చూడగలరని వెంకన్న సందేహించలేదు. ఎందుకంటే చిన్నోణ్ణి చేర్పించిన కరణం గారూ ఆ కార్లోనే మునసబుగారి వెంట వున్నారు.

ఆ నాయకుడికి తొంభై ఏండ్లు దాటి వుంటాయి. వార్ధక్యం వచ్చినా నవ యువకుడిలా వుంటారనీ ఎవర్ గ్రీన్ అని పేపర్లు ఆయన్ని గురించి రాస్తుంటాయి. రాజకీయాల్లో ఆయన పండిపోయినా, ఎప్పుడూ ఆకుపచ్చని దోర కాయలాగే ఉంటారట ఆయన. మెదడు, అవయవాలు అన్ని చురుగ్గా పనిచేస్తున్నై అని, ఆయన పోతే దేశంలో మరో నాయకుడు లేడని పత్రికలు ఘోషిస్తున్నాయి. ప్రార్థనలు, యజ్ఞాలూ ఒకటేమిటి - దేశమంతా ఆయనకోసం దేవాలయమై అభిషేకాలతో తడుస్తూంది.

నెలరోజుల్నుంచీ ఆయన కోమాలో ఉన్నారు. ఆస్పత్రి చుట్టూతా గదుల్లోనూ, అటూ ఇటూ పాతిక మైళ్ళ లోపున ఉన్న అన్ని హోటళ్ళలోనూ నాయకులు బసచేశారు. ఆయన కన్ను మూయరాదు. మూస్తే దేశం ఘోరమయిన విపత్తులో పడిపోతుంది.

ఆయన కోమాలో వున్న ఈనెల రోజులు మాత్రం నిజంగా దేశం విపత్తులో ఉన్నట్టే అనిపించింది. ఆఫీసులు పని చెయ్యటం లేదు. మంత్రులు ఫైళ్ళు చూడడం లేదు. అసెంబ్లీలు నిరవధికంగా చచ్చిపోయినై.

ఇది పెద్ద విపత్తు కాదనే అనిపించింది మునసబుగారికి అంతరంలో. ఎందుకంటే ఇదివరకు లాగానే వస్తువులు అధికధరల కయితేనేం దొరుకుతూనే వున్నవి. తామందరూ ఆస్పత్రి చుట్టు వున్న హోటళ్ళల్లో ఎప్పుడు పడితే అప్పుడు ఏదిపడితే అది తింటూనే వున్నారు. నిజంగా విపత్తు తన సంహా విని వెంకయ్య అరక మానేసిన రోజున వస్తుందని ఆయన అనుకున్నాడు కానీ పైకి అనలేదు. "ఎప్పటికీ గండం గడిచేను" అని బయటికే మొక్కు కొంటున్న కరణంగారితో గొంతు కలిపేరు ఆయన.

"ముసిలివద్దు ఆయన పోతేనేం దేశం గొడ్డుపోయిందా? ఆయన పుట్టకముందు దేశం ఏమయింది. అదే ఆ తర్వాత అవుతుంది. అసలు ఇదంతా అహం, ఇగో.

ఈ పర్సనాల్టీ కల్టు నశించాలి" అని ఒకాయన ఆస్పత్రికి దూరంగానే చెట్టు కింద ఎవరితోనో చెబుతుంటే పోలీసులు లాక్కెళ్ళి దూరంగా వదిలేసి వచ్చారు.

మునుసుబుగారతన్ని పిలిచి పోలీసుల్తో మాట్లాడి నచ్చచెప్పడం వలనే ఆ వదలడమయినా జరిగింది. ఆయన వట్టి మునసబుగాదు, ఆయనతమ్ముడు ఆ ప్రాంతంలో పేరుపొందిన పార్టీ మనిషి. మంత్రి కాలేదు కాని, మంత్రుల్ని గుప్పెట్లో ఉంచుకున్నాడు అతను. ఆయన ఇప్పుడు అస్పత్రిలో నాయకుడి ప్రక్కనే కూర్చుని నాయకుడికి బదులు భుజం కదుపుతున్నాడు. సలహాలిస్తున్నాడు – అవసరం అయిన పన్లు చూస్తున్నాడు. మాటిమాటికీ బయటికి వచ్చి ఆకాశం వంక చూస్తున్నాడు. వాన వస్తుందని కాదు, హెలికాప్టరు కనబడుతుందేమో అని.

అవసరమయినమందులు మరోదేశం నుంచీ అతిజరూరుగా ప్లేన్‌లో పంపారు. అవి రావాలి. హెలికాప్టరు పాడ్ ఆ రోజే అవసరంగా తయారు చేశారు దగ్గరలో ఒక స్కూలు కాంపౌండులో, చదును చేసి నున్నంచేసి.

ఆస్పత్రిలో డాక్టర్లు అందరూ నాయకుని చుట్టూతా కాపుండి ఏ సందులోంచీ యమదూతలు రాకుండా అడ్డం కాస్తున్నారు. ఏ చిన్న కన్నంలోంచీ ప్రాణ వాయువు ఎగిరి పోకుండా చూస్తున్నారు.

ఆ నెలబట్టి ఆస్పత్రిలో మిగతా రోగుల మాట దేవుడే ఎరుగు. డాక్టరు ఎరిగిందల్లా వాళ్ళ ప్రాణాలు దేశాల కంత జరూరుగాదనే. అంతకన్నా వాళ్ళకు తెలిసింది తమ ప్రమోషన్లు ఆ నాయకుని పక్కనే కనుసన్నల్లో మెలిగే మంత్రుల కటాక్షాల మీదనే అని. అందుకే వాళ్ళు మంత్రులు కనురెప్పల క్రిందే కాపరం వుంటున్నారు.

పిల్లల వార్డులో వున్న చిన్నోడు పాపం దిగులుగా ఉన్నాడు. అతని రోగం అంత ప్రమాదమయింది కాదని డాక్టరు కరణంగారికి చెప్పాడు. ఆయన అదే ముక్క మునసబు గారికీ చెప్పాడు. అందుకని కొంచెం జాప్యం అయినా ఫరవా లేదు అని మునసబుగారనుకున్నాడు. నాయకుడి విషయం తేలింతర్వాత చూచుకో వచ్చనే అయన అనుకున్నాడు.

ఆస్పత్రి మొత్తం మీద ఒకళ్లిద్దరు డాక్టర్లు మాత్రం నాయకుడిని పెద్దవాళ్లకి వదిలేసి తాము చిన్న వాళ్ళని పట్టించుకొని తిరుగుతున్నారు. అందులో ఓ కుర్ర డాక్టరు మరీని, అతని వాలకం అతని కొలిగ్స్‌కి అంతుపట్టడం లేదు. 'పిచ్చాడని' సరిపుచ్చుకున్నారు.

కుర్ర డాక్టరు చిన్నాణ్ణి చూసి నిట్టూర్చాడు. అవసరంగా అతనికి ఒక మందు పడేస్తే వారంలో తగ్గిపోతుంది. కాకపోతే ఆ మందు ఈ దేశంలో దొరకదు. వేళకి ఆ మందు పడకపోతే ఆ తర్వాత కుదరదని చెప్పలేడు గాని మందు పడితే నిక్కచ్చిగా కుదురుతుందని చెప్పగలడు. నాయకుడికి వస్తున్న మందుల్లో అది వుంది.

నాయకుడెలాగూ బతకడని పెద్ద డాక్టరు చెప్పడం కుర్ర డాక్టరుకి తెలుసు. "చెయ్యగలగిందల్లా చేశామని తృప్తి కోసమే" అని ఆయన అనడం ఆ చుట్టూవున్న ఇతర నాయకులకూ తెలుసు. అసలు అందరికీ తెలుసు ముసలి

ప్రాణం ఎన్నాళ్ళుంటుంది పోక అని. అయితే ఆ మాట అనగల ధైర్యం ఎవరికీ లేదు. ఈ రోజు ఆ నాయకుడి పట్ల చూపుతున్న ప్రేమ, అభిమానం, అటెన్షన్ ఇవి తరువాత తమకి నిచ్చేన మెట్లవుతాయన్న ఆశే అందరిదీ. ఎన్ని మందులు వాడినా "చివరికి సరిఅయిన మెడికల్ అటెన్షన్ అయన కంద లేదని" గొడవ బయల్దేర గూడదన్న ఉద్దేశంతోనే అన్ని ప్రికాషన్లూ తీసుకో పడం జరుగుతోంది.

కుర్ర డాక్టరు పెద్ద డాక్టరుతో చెప్పాడా విషయం. ఆ మందు బోలెడు వస్తుంది కదా, కొంచెం మరో పేషెం టుకు వాడవచ్చునాఅని. పెద్దాయననవ్వి ఊరుకున్నాడు. కొంచెం కోపంగా చూశాడు కూడాను. కాని కుర్ర డాక్టరు ఎంతో నమ్రతగానే అయినా, స్పష్టంగా చెప్పాడు. ఆ చిన్న కుర్రాణ్ణి ఆస్పత్రిలో వదిలేసి తండ్రి వెళ్ళిపోయాడని. అందు కని ఆ భారం తనదే అని. పెద్ద డాక్టరు మాట్లాడలేదు. వెళ్ళిపొమ్మని సౌంజ్ఞ చేశాడు. కుర్ర డాక్టరుకి ఉడుకు మోత్త నం వచ్చింది. కాని ఏం చెయ్యగలడు?

వెంకయ్య చిన్నాణ్ణి వదిలేసి పోతూ డాక్టరు గారికి నాలుగు అనపకాయలు-ఇంత గోంగూర ఇచ్చి - పొలం పన్లు అదును తప్పితే ఏటికేడాది పస్తులు పడు కోవాల్సి వస్తుందనీ-అందుకని కుర్రాడి బాధ్యత చూసుకోండని చెప్పి గుడ్ల నీరు కక్కుకుంటూ వెళ్ళిపోయాడు. డాక్టరు కతని చివరి చూపు ఇంకా కళ్ళల్లో మెదుల్తూనే ఉంది. దేశంలో మనుషులు కొందరయినా తమ బాధ్యతను నిర్వ ర్తిస్తునే ఉన్నారు. తనకింత తిండి పెడు తూన్న చెయ్యికింత అసరా ఇవ్వడం తన విధి అని నిశ్చయించుకున్నాడు.

చిన్నాడి పరిస్థితి కొంచెం తారుమార యింది. ఊపిరి అందడంలేదు. బాధపడు తున్నాడు. అక్సిజన్ పెట్టమని సిస్టర్ని కేకేసి చెప్పాడు. స్తంభంలా నిల్చుం దామె. ఆ వార్డుల్లో వున్న ఆరూ నాయ కుడి దగ్గరే 'స్టాండుబై'గా ఉన్నై. అందుబాటులో ఇప్పుడు ఒక్కటీ లేదు.

వెంటనే వెళ్ళి తెమ్మని వార్డుబాయ్ని పంపాడు. వాడువచ్చి అసలాగది లోకి పోవటానికే భయంగా ఉందని చెప్పాడు. డాక్టరుకి కదలక తప్పలేదు.

ఒక్క సిలిండరు కదలడానికి వీల్లేదని డ్యూటీలో ఉన్న తన కొలిగే పట్టు పట్టాడు. ఆయన చుట్టూరాఉన్న నాయ కులు వత్తాసు వచ్చారు. డాక్టరు ఎంత చెప్పినా వాళ్ళు వినిపించుకోలేదు. "ఆరు సిలిండర్లు కాదు అరవై అయినా ఎటుపోయి ఎటువస్తుందో, రిస్కు తీసు కోవడానికి వీల్లేదు" అని పట్టుపట్టారు. డాక్టరు బయటకి వచ్చాడు చేసేదిలేక.

చిన్నాడిని చూడడానికి వెళ్ళిన కరణం గారు డాక్టరుగారి నడిగాడు, కుర్రాడికి గొట్టం పెట్టాలని సిస్టర్ చెప్పింది. ఎప్పుడు పెడ్తారు?" డాక్టరు చిరాగ్గా "ముసలి నాయకుడున్నాడుగా, వాడు బాల్చీ తన్ననీండి - అప్పుడు" అనేసి వెళ్ళిపోయాడు. కానీ ఎక్కువ సేపు అతనుండ లేక పోయాడు వార్డులో. చిన్నాడు ఎగిరెగిరి పడుతున్నాడు. ఆక్సిజన్ పెడితే అయిదారు గంటలలో అతను ఊపిరందు కుంటాడు. బతికే ప్రాణం, బతకాల్సిన ప్రాణం.

డాక్టరు గబగబా వెళ్ళి అటకాయిం చినవాళ్ళని పక్కకుతోసి ఒక సిలిండరు తీసుకొని వచ్చాడు. 'దేవుడికి చెప్పు

కొండి' అని ఆయన అనడం చాలామంది విన్నారు. నాయకులు కొందరు అడ్డం తగిలారుగాని, కరణంగారు, మునసబుగారు సర్దారు. "పోనీండి, ఈ వార్డేగా, అవసరం అయితే మేం తెస్తాం సిలెండరు". డ్యూటీ డాక్టరు అరిచాడు "చూడు ఫిర్యాదు చేస్తాను" అంటూ.

ప్రాణావసరం అయిన మందులు పెద్ద డాక్టరు చేతిలోకి వచ్చినై. నాయకుడు అపస్మారకం, స్మారకం మధ్యలో ఉన్నాడు. అనుయాయులంతా ఆత్రంగా ఆయన వంక చూశారు. అందర్నీ బయటకి పోయి ప్రార్ధన చెయ్యమని చెప్పి ఆయన నాయకుడికి ముందు ఒక ఇంజక్షన్ ఇచ్చారు. నాయకుడిలో రియాక్షన్ వచ్చింది. బయటికి పోతున్న వాళ్లు తొంగిచూశారు. "ఏమిటిదంతా. పన్లు మానేసి నా చుట్టూరా నిల్చున్నారా? పొండి పొండి ఇదేనా మీకు ఇన్నాళ్లూ నేను చెప్పింది? ముసలి ప్రాణం పోక ఏం చేస్తుంది - పొండి" అని మళ్ళీ మైకంలో పడిపోయారు. "ఎంత గొప్ప మనస్సు" అన్నారే కాని ఎవరూ ఆస్పత్రి వదలి పోలేదు.

కుర్ర డాక్టర్ని పిలిచాడు పెద్దడాక్టరు రూమ్‌లోకి. భయంగానే వెళ్ళి కుర్ర డాక్టరు సంజాయిషీ చెప్పబోయాడు. ఆగమని సంజ్ఞ చేశాడు పెద్ద డాక్టరు. చిన్న డాక్టరు చెయ్యి పట్టుకొని తన చేత్తో నొక్కి "నాయకుడి విషయం నీకు తెలీదు. ఆయన నిజంగా ఈ దేశానిక్కావల్సినవాడు" అన్నాడు. కుర్రడాక్టరు చెయ్యి విప్పిచూస్తే తను అడిగిన 'మందులపెట్టి' ఉంది. ఎవరికీ చెప్పొద్దు అంటూ పెద్ద డాక్టరు మళ్ళీ 'మంది' లోకి వెళ్ళిపోయాడు.

శపథం ..... రంగినేని సుబ్రహ్మణ్యం

చిత్రం! ఆకాశం చిల్లిపడిందా?
యుగయుగాల అంతర్మథనం
ఆవిరైందా?
ఉషస్సులోని రోచిస్సు పరువం
పండిందా?
సంధ్య కన్నెర్ర చేసిందా?

ఔనూ, ఇంత బడబానలం ఆవరించిన
దావానలం
గుండెల్లో గూడు కట్టుకుంది,
పూర్వ దిశాంచలాల సంకెళ్లు ఛేదించు
కొని
నిశీథాలు చీలుస్తూ నిర్గమిస్తున్న
వ్యథ ఆవేదన ఆవేశం
నన్ను నడిపిస్తున్నాయీ! ... ...
వర్షాభ్రం లో నుండి తొంగి చూచే
ఇంద్రచాపాలూ నన్ను మధ్య పెట్టలేవు
తెల్లని మబ్బులో దోబూచులాడే
చల్లని వెన్నెలలూ సముదాయించ లేవు!
ఎప్పుడో - ఏ క్షణంలోనో
అకాల వసంతంలా
సకాల గ్రీష్మాతపంలా
ఒళ్లు విరుచుకొంటాను -
కళ్లు తెరుస్తాను
పిడికిలి బిగిస్తా - అడుగులు నడిపిస్తా.
భ్రమలో పెట్టె గీతాలు నాకు రుచించవు
ఉపయారుణ సద్యాలు రుచించ లేవు.
నన్ను వెన్నంటే ఉషస్సును మధ్యందిన
మార్తాండ తేజస్సుగా
ఓజస్సుతో మారుస్తాను,
ఉర్విని నడిపిస్తానూ - సామాన్యుని
సంశయాలు తీరుస్తాను
సౌఖ్యానికి బాటలు వేస్తాను
ఇదీ నా పథం - శపథం - నా చరిత్ర.